

వలలు సిద్ధం చేస్తున్న దృశ్యం



పడవపై భారత జెండాను కడుతున్న యువకుడు

హైలెస్సో.. హైలెస్సా...
సాగరంలో మళ్లీ సందడి

- అర్ధరాత్రితో ముగిసిన వేట నిషేధం
- ఉత్సాహంగా బయలుదేరిన మత్స్యకారులు

ప్యారీస్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరికి ఆనుకొని ఉన్న బంగాళాఖాతంలో 61 రోజుల చేపల వేట నిషేధ కాలం శనివారంతో పూర్తవడంతో అర్ధరాత్రి నుంచి జాలర్లు 'హైలెస్సా' అంటూ తమ పడవల్లో సందడి చేస్తూ సముద్రంలో చేపల వేటకు బయల్దేరి వెళ్లారు. నిషేధకాలంలో మర పడవలు, ఇంజన్లు, వలలకు మరమ్మతులు పూర్తిచేసిన మత్స్యకారులు శనివారం ఉదయం రాష్ట్రవ్యాప్తంగా సముద్రతీరాల్లో పడవలకు పూజలు నిర్వహించారు. రెండు నెలల అనంతరం వేటకు వెళ్తున్న ఆనందంలో కోస్తా జిల్లాల్లో సందడి నెలకొంది.

చేపల వేటపై ముగిసిన నిషేధం...

సముద్రంలో చేపలు, సముద్రజీవుల సంతానోత్పత్తి జరిగే సమయంలో కేంద్ర ప్రభుత్వం 2000 సంవత్సరం నుంచి 45 రోజులు చేపల వేటపై నిషేధం విధించింది. 2017వ సంవత్సరం నుంచి ఈ నిషేధకాలాన్ని 61 రోజులకు పెంచారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపల వేట నిషేధకాలం ఏప్రిల్ 15న ప్రారంభమై శనివారంతో ముగిసింది. దీంతో, స్థానిక కాశిమేడు, పట్టిణంబాక్కం, తిరుపోరూర్, మహాబలిపురం, అక్కరై, పుదుకోట, తంజావూరు, సేలం తదితర ప్రాంతాల జాలర్లు సుమారు 8వేలకు పైగా మరబోట్లలో చేపల వేటకు బయల్దేరి వెళ్లారు. శనివారం ఉదయం సముద్రతీరంలో పడవలు నిలిపి, ఐస్, అవసరమైన డీజిల్ నింపారు.

డీజిల్‌కు రాయితీ...

ఈ నేపథ్యంలో, చేపల వేట నిషేధకాలంలో ఉపాధి కోల్పోయిన జాలర్లకు ప్రభుత్వం రెండు నెలలు ఆర్థికసాయం అందజేసింది. అంతేకాకుండా, చేపల వేటకు సిద్ధమైన మత్స్యకారులకు రాయితీపై డీజిల్ కూడా సరఫరా చేసింది. వేటకు వెళుతున్న సందర్భంగా కాశిమేడు ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులు మీడియాతో మాట్లాడారు.చేపల వేటపై విధించిన నిషేధకాలంలో చేపలు, రొయ్యలు, పీతలు తదితరాల ధరలు పెరిగాయని, మరో రెండు,మూడు రోజుల్లో ధరలు తగ్గిపోయే అవకాశముందన్నారు. ఒక్కొక్క మరబోటు మరమ్మతుకు కనీసం రూ.9 లక్షలు ఖర్చవుతుందని, డిజిల్ రాయితీగా 1,800 లీటర్లు మాత్రమే ఇస్తున్నారని, అందువల్ల నష్టపోతున్న తమను ప్రభుత్వమే ఆదుకోవాలని మత్స్యకారులు విజ్ఞప్తి చేశారు.

'హక్కుల సాధనకు పిలుపు'
స్టాలిన్ ఎన్నికల ప్రచారానికి
వాహనాలు సిద్ధం

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ శాసనసభ ఎన్నికల్లో ఈ సారి కొత్త హంగులు, సదుపాయాలు సంతరించుకున్న వాహనాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేయడానికి సిద్ధమవుతున్నారు. 'నలుపు - ఎరుపు రంగులతో రాష్ట్ర హక్కుల సాధనకు స్టాలిన్ పిలుపు' అనే నినాదం ఉన్న రెండు ప్రచార వాహనాలు తేనాంపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. శాసనసభ ఎన్నికలకు ఇక పది నెలలు మాత్రమే మిగిలి ఉండటంతో డీఎంకే, అన్నాడీఎంకే సహా ప్రధాన పార్టీలు ఓ వైపు పొత్తులపై దృష్టిసారిస్తూ, మరోవైపు ప్రచార కార్యక్రమాలపై వ్యూహరచన చేస్తున్నాయి, ఈ సారి ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందే ప్రచార యాత్ర చేపట్టాలని స్టాలిన్ సంకల్పించారు. ప్రస్తుతం కూటమిలో ఉన్న మిత్రపక్షాలతో సీట్ల సర్దుబాట్లపై చర్చలు జరిపేందుకు పార్టీ సీనియర్ నేతలు దురైమురుగన్, టీఆర్‌బాలు, కనిమొళి, పెరియసామి, ఎ.రాజాతో కూడిన బృందాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ సారి డీఎంకే కూటమి 200 స్థానాల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో శాసనసభ ఎన్నికల బరిలోకి దిగుతున్నానని స్టాలిన్ ఇదివరకే ప్రకటించారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి రాష్ట్రమంతటా సుడిగాలి పర్యటన జరపాలని, ప్రధాన నగరాల్లో రోడ్‌షోలు జరపాలని కూడా ఆయన నిర్ణయించారు. ఈ పరిస్థితులలో అన్నా అరివాలయం వద్ద స్టాలిన్ ప్రచారం కోసం ఓ తెలుపు రంగు వాహనాన్ని, నలుపు, ఎరుపు రంగుతో కూడిన మరో వాహనాన్ని తీసుకువచ్చి, అందులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. తెలుపు వాహనాన్ని పరిశీలించిన మీదట నలుపు, ఎరుపు రంగుతో పెయింట్ చేసిన వాహనాన్ని కూడా పరిశీలించారు. ఈ వాహనంలోనే స్టాలిన్ రాష్ట్రంలో ఎక్కువగా పర్యటించనున్నారని పార్టీ నేతలు తెలిపారు. ప్రస్తుతం ఈ రెండు వాహనాలకు తుదిమెరుగులు దిద్దుతున్నారు.



20న చెంగల్పట్టు ఇన్‌ఛార్జులతో భేటీ...

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 20న చెంగల్పట్టు జిల్లాలోని నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో స్టాలిన్ భేటీ అవుతున్నారు. రాష్ట్రంలో 234 శాసనసభ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులను తెలుసుకునేందుకు 'ఉడన్‌పిరప్పే వా' అనే నినాదంతో నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో శుక్రవారం నుంచి చర్చలు ప్రారంభించారు. ఈ నెల 17న పరమత్తివేలూరు, గౌండంపాళయం, కృష్ణగిరి నియోజకవర్గాలకు చెందిన పార్టీ ఇన్‌ఛార్జులతో అన్నా అరివాలయంలో చర్చలు జరుపనున్నారని పార్టీ ఓ ప్రకటనలో తెలిపింది. ఇదే విధంగా ఈ నెల 20 చెంగల్పట్టు జిల్లాలోని నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో ఆయన సమావేశమై ఆ జిల్లాలో పార్టీ పరిస్థితులను గురించి అడిగి తెలుసుకోనున్నారు.



ముఖ్యమంత్రి కానుకగా ఇచ్చిన లాప్‌టాప్‌తో రాజేశ్వరి

జేఈఈ విజేతకు నివాసం

- సీఎం స్టాలిన్ ఆదేశం

టినగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ పరీక్షలో ఉత్తీర్ణురాలైన గిరిజన విద్యార్థి ఎ.రాజేశ్వరికి రూ. 5.73 లక్షల విలువైన నివాసగృహాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కేటాయించారు. సేలం జిల్లా కల్వరాయన్‌మలై సమీపం కరుమత్తురై ప్రభుత్వ గిరిజన రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివిన రాజేశ్వరి ఇటీవల జరిగిన జేఈఈ పరీక్షల్లో జాతీయ స్థాయిలో 417ర్యాంక్ సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఈ విద్యార్థిని తండ్రి రెండేళ్ల క్రితం మృతి చెందాడు. తల్లి కవిత, సోదరి జగదీశ్వరి, సోదరుడు గణేష్‌తో కరుమత్తురై గిరిజన ప్రాంతంలో నివసిస్తోంది. గిరిజన సంక్షేమ శాఖ నిర్వహించిన ప్రత్యేక తరగతులు, ఈరోడ్ జిల్లా పెరుందురైలోని ప్రభుత్వ శిక్షణా శిబిరంలో రాజేశ్వరి జేఈఈ పరీక్షలకు శిక్షణ పొంది ర్యాంక్ సాధించింది. ఐఐటీ మద్రాస్‌లో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ కోర్సులో చేరనుంది.

సీఎం స్టాలిన్ కానుక...

జేఈఈలో ఉత్తీర్ణురాలైన రాజేశ్వరి గురించి వివరాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ నెల 12న సేలంలో పర్యటించినప్పుడు ఆమెను అభినందిస్తూ రూ.70 వేల విలువైన లాప్‌టాప్ కానుకగా అందించారు. రాజేశ్వరికి సొంతిల్లు లేదని తెలుసుకున్న స్టాలిన్ గిరిజన సంక్షేమ శాఖ గృహనిర్మాణ పథకం కింద ఆమెకు రూ.5.73 విలువైన ఇల్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయమై రాజేశ్వరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి తనను అభినందించడం చాలా సంతోషంగా ఉందని, విలువైన లాప్‌టాప్ కానుకగా ఇవ్వటమే కాకుండా తమ చిరకాల సొంతింటి కల కూడా నెరవేరుస్తున్న ఆయనకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలిపింది.

16 బిల్లులకు గవర్నర్ ఆమోదం

ప్యారీస్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఆమోదించిన 16 చట్టసవరణ బిల్లులను గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఆమోదించినట్లు శనివారం రాష్ట్రప్రభుత్వం జీవో విడుదల చేసింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో అసెంబ్లీలో నిర్వహించిన బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం 18 బిల్లులు ప్రవేశపెట్టి ఏప్రిల్ 29న ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ బిల్లులను గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఆమోదం కోసం ప్రభుత్వం పంపించింది. శుక్రవారం రెండు బిల్లులను ఆమోదించిన గవర్నర్, మిగిలిన 16 బిల్లులను శనివారం ఆమోదించినట్లు రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన జీవోలో తెలిపింది.

పెరంబూరు రైల్వేస్టేషన్ వద్ద గొయ్యి

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరు రైల్వేస్టేషన్ ఎదుట పెరంబూరు హైరోడ్డులో శనివారం ఉదయం ఆకస్మికంగా గొయ్యి ఏర్పడటంతో వాహనచోదకులు,స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆ ప్రాంతంలో మెట్రో రైలు పనులు జరుగుతున్న కారణంగా ఈ గొయ్యి ఏర్పడిందని అనుమానిస్తున్నారు. స్థానికులు ట్రాఫిక్ పోలీసులకు, కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఆ మార్గంలో వాహనాలు వెళ్లకుండా కట్టుదిట్టం చేశారు. అదే సమయంలో వాటర్ బోర్డు, మురుగునీటి విభాగం కార్మికులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఆ గోతిని పూడ్చే పనులు ప్రారంభించారు. ఆ ఆప్రాంతానికి 50 అడుగుల దూరంలో మెట్రోరైలు మార్గం నిర్మాణ పనులు జరుగుతుండటం వల్లే ఈ గొయ్యి ఏర్పడి ఉంటుందని కార్పొరేషన్ కార్మికులు చెబుతున్నారు.



పెరంబూరు రైల్వేస్టేషన్ వద్ద ఏర్పడిన ఆరడుగుల లోతు గొయ్యి

సీఎంతో జోన్ ఇన్‌చార్జుల భేటీ

అడయార్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే యేడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జోన్ ఇన్‌చార్జులతో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వన్ టూ వన్ పేరుతో జరిగిన సమావేశంలో శనివారం చిదంబరం, విల్లుపురం, ఉసిలంపట్టి తదితర ప్రాంతాల డీఎంకే నాయకులతో సమావేశమయ్యారు. ఆళ్వార్‌పేట, చిత్తరంజన్ దాస్ సాలైలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. ఇందులో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు ఏవీ వేలు, కేఎన్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన దిశా నిర్దేశం చేశారు.. అలాగే, ఈ నెల 17వ తేదీ కూడా ఆయన మరికొందరు జోన్ ఇన్‌చార్జులు, నాయకులతో సమావేశం కానున్నారు. ఇదిలావుంటే, అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను ఆయన అప్రమత్తం చేస్తున్న విషయం తెల్సిందే. ఇందులో భాగంగా, 8 జోన్‌లు, 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను నియమించి, వారితో తరచుగా సమాలోచనలు చేస్తున్న విషయం తెల్సిందే.



జానపద కళాకారిణి 'కలైమామణి' కరుప్పాయి మృతి



కరుప్పాయి అమ్మాళ్ (ఫైల్‌ఫొటో)

అడయార్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గ్రామీణ జానపద కళాకారిణి, సినీ నటి 'కలైమామణి' కొల్లంగుడి కరుప్పాయి అమ్మాళ్ (99) శనివారం కన్నుమూశారు. శివగంగై జిల్లా కొల్లంగుడిలో ముత్తన్ - కరుప్పియమ్మాళ్ అనే దంపతుల రెండో కుమార్తె అయిన కరుప్పాయి కొల్లంగుడిలో గ్రామీణ, జానపద పాటలు పాడుతూ మంచి గుర్తింపు పొందారు. తన ఊరి పేరునే తన పేరుగా మార్చుకున్నారు. ఈ క్రమంలో ఆర్.పాండ్యరాజన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన 'ఆణ్‌పావం' చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమయ్యారు. ఇందులో పాండ్యరాజన్‌కు బామ్మగా నటించారు. ఆ తర్వాత పాండ్యరాజన్ చిత్రాల్లో ఆమె నటించారు. చివరగా శశికుమార్ హీరోగా నటించిన 'కారి' మూవీలో కనిపించారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలిత ఆమెకు 'కలైమామణి' అవార్డు ప్రదానం చేశారు. ఆ సమయంలో 'మీకు ఏమి కావాలని కరుప్పాయిని జయలలిత అడగ్గా... తమ గ్రామంలో పాఠశాల భూమికి పట్టా ఇవ్వాలని కోరారు. దీంతో సీఎం హోదాలో జయలలిత తక్షణం పాఠశాల స్థలానికి పట్టా మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో వయోభారంతో మృతి చెందిన కరుప్పాయి అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామంలో జరుగనున్నాయి. ఆమె మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

నీట్‌లో మెరిసిన మనోళ్లు

- రాష్ట్రం నుంచి 76,181 మంది
- పుదుచ్చేరి నుంచి 2639 మంది అర్హత
- ఆలిండియా టాప్ 100 ర్యాంకుల్లో ఆరుగురు రాష్ట్ర విద్యార్థులు

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): 'నీట్' ఫలితాల్లో రాష్ట్రం నుంచి 76,181 మంది అర్హత సాధించారు. నీట్‌కు హాజరైన వారిలో 50 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించడం విశేషం. ఆలిండియా స్థాయిలో 27వ ర్యాంక్ సాధించిన సూర్య నారాయణన్ రాష్ట్ర టాపర్‌గా నిలవగా, టాప్ వంద ర్యాంకుల్లో రాష్ట్ర విద్యార్థులు ఆరుగురు నిలిచారు. ఈ ఆరుగురూ బాలురే కావడం విశేషం. గత నెలలో జరిగిన నీట్ కోసం రాష్ట్రం నుంచి 1,40,158 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, 1,35,715 మంది హాజరయ్యారు. వారిలో 76,181 మంది అర్హత సాధించారు. ఆలిండియా స్థాయిలో టాప్ వంద ర్యాంకుల్లో సూర్య నారాయణన్ (27వ ర్యాంకు), అభినీత్ నాగరాజ్ (50వ ర్యాంకు), పుగశేంది జీఎస్ (61వ ర్యాంకు), హృతిక్ విజయ రాజా కేఎస్ (63వ ర్యాంకు), రాకేష్ ఏజే (78వ ర్యాంకు), ప్రజాన్ శ్రీవారి.జి. (88వ ర్యాంకు) నిలిచారు. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి నుంచి 5,149 మంది విద్యార్థులు నీట్‌కు హాజరుకాగా, 2,639 మంది అర్హత సాధించారు. పుదుచ్చేరి టాపర్‌గా జి.ప్రశాంత్ (ఆలిండియా స్థాయిలో 127వ ర్యాంకు) నిలిచాడు ఇదిలా వుండగా రాష్ట్రంలో ప్రథమ ర్యాంకర్‌గా నిలిచిన సూర్యనారాయణన్‌ది తిరునల్వేలి జిల్లా పాళయంకోట. అతను పాళయంకోటలోని పుష్పలతా విద్యామందిర్‌లో ప్లస్‌టూ పూర్తి చేశాడు. ఉత్తమ ర్యాంకు సాధించిన తమ విద్యార్థికి ఆ పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించి, అభినందించారు.



సూర్య నారాయణన్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా సత్యభామ వర్సిటీ స్నాతకోత్సవం

- దర్శకుడు అట్లీ కుమార్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం

ప్యారీస్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక షోలింగనల్లూరులో వున్న సత్యభామ డీమ్డ్ యూనివర్శిటీ 34వ స్నాతకోత్సవం శనివారం యూనివర్శిటీ ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఇస్రో ఛైర్మెన్ డాక్టర్ వి.నారాయణన్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా, ఈ వేడుకలకు ఛాన్సలర్ డాక్టర్ మరియా జీనాజాన్సన్, ప్రెసిడెంట్ డాక్టర్ మేరీ జాన్సన్ సారథ్యం వహించారు. ప్రముఖ సినీ దర్శకుడు అట్లీ కుమార్ సేవలను కొనియాడుతూ ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఈ వర్శిటీకి చెందిన 4,221 మంది యూజీ విద్యార్థులు, 810 పీజీ విద్యార్థులు, 79 పీహెచ్‌డీ విద్యార్థులకు డాక్టరేట్లు అందజేశారు. మరో 54 మంది మెరిట్ విద్యార్థులకు గోల్డ్ మెడల్‌తో పాటు 5,031 మంది విద్యార్థులకు పట్టాలు అందించారు. కార్యక్రమంలో ఛాన్సలర్ మాట్లాడుతూ సత్యభామ వర్శిటీలో 2024-2025వ విద్యా సంవత్సరంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో సుమారు 400 సంస్థలు పాల్గొని 92.74 శాతం మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు ఇచ్చాయని ఆమె తెలిపారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ఎస్ రావు ఆహ్వానం పలుకగా, వైస్ ఛాన్సలర్ డాక్టర్ టి.శశిప్రభ వార్షిక నివేదిక సమర్పించారు. వైస్ ప్రెసిడెంట్లు జె.అరుళ్ సెల్వన్, మరియా బెర్నాడిటీ జాన్సన్, ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ లోగాషణ్ముగం, డాక్టర్ బి.షీలారాణితో పాటు ప్రొఫెసర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని పట్టభద్రులకు శుభాకాంక్షలు తెలిపారు.




సినీ దర్శకుడు అట్లీ కుమార్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న ఛాన్సలర్ మరియా జీనా జాన్సన్

నీలగిరికి భారీ వర్షసూచన

- జిల్లా యంత్రాంగం సిద్ధం
- కలెక్టర్ లక్ష్మీ భవ్య

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో రెండు రోజుల పాటు కుండపోతగా వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం రెడ్ అలెర్ట్ జారీ చేయడంతో ఆ జిల్లాలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ బృందం ముందస్తు జాగ్రత్త చర్యలను ముమ్మరం చేసింది. మట్టి పెళ్ళలు పడే ప్రాంతాలను గుర్తించి, అక్కడ మట్టిపెళ్ళలు రహదారుల్ల పడకుండా టార్పాలిన్‌లతో అడ్డుకట్ట నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లక్ష్మీ భవ్యా తన్నీరు మీడియాతో మాట్లాడుతూ భారీ వర్షాలను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని చెప్పారు. ఊటీ, కున్నూరు తదితర పర్యాటక ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. భారీ వర్ష సూచన కారణంగా జిల్లాలో శనివారం పాఠశాలలన్నింటికీ సెలవు ప్రకటించినట్లు చెప్పారు.జాతీయ విపత్తుల నిర్వహణ బృందం అధికారి కమాండర్ గోపీనాథ్ నాయకత్వంలో నీలగిరి అంతటా మట్టిపెళ్ళలు పడే అవకాశమున్న ప్రాంతాల్లోనూ, పల్లపు ప్రాంతాల్లోనూ నివసిస్తున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని చెప్పారు. నెల్లిత్తురై, విలంబ్తూరు, సమయపురం, మేట్టుపాళయం, సిరుముగై, వచ్చినంబాళయం తదితర ప్రాంతాల్లో మట్టిచరియలు విరిగి పేడా అవకాశాలు ఉండటంతో ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.



కున్నూరు సమీపంలో రహదారి పక్కన మట్టిపెళ్లలు జారిపడకుండా టార్పాలిన్ కప్పుతున్న రాష్ట్ర విపత్తుల నిర్వహణ బృందం

సమాచార దర్శిని

నేడు గ్రూప్-1, 1ఏ ప్రిలిమినరీ పరీక్షలు

పెరంబూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం గ్రూప్-1, 1ఏ ప్రిలిమినరీ పరీక్ష జరుగనుంది.70 ఖాళీ పోస్టులుండగా మొత్తం 2,49,296 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సంబంధించిన ప్రిలిమినరీ పరీక్షలు రాష్ట్రంలోని 38 జిల్లాలు, 6 తాలూకాలు మొత్తం 44 ప్రాంతాల్లో ఆదివారం జరుగనున్నాయి. రాజధాని నగరం చెన్నైలో 170 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.. పరీక్షల పర్యవేక్షణకు 987 మంది అధికారులను నియమించినట్లు టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

మద్రాసు వర్సిటీ దూరవిద్య సెమిస్టర్ పరీక్షల వాయిదా

టి.నగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మద్రాసు విశ్వవిద్యాలయం సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు ఆ విశ్వవిద్యాలయం ప్రకటించింది. ఈ నెల 15న రాష్ట్రవ్యాప్తంగా టీఎన్పీఎస్సీ గ్రూప్-1 పరీక్షలు జరుగుతుండగా అదే రోజు జరగాల్సిన దూరవిద్య సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ పరీక్షల ఏయే తేదీల్లో జరుగుతాయనే వివరాలు www.ideunom.ac.in అనే వెబ్‌సైట్‌లో ప్రకటించినట్లు విశ్వవిద్యాలయం నిర్వాహకులు తెలిపారు.

నాగై-శ్రీలంక నౌకా సేవల నిలిపివేత

పెరంబూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం-శ్రీలంక ప్యాసింజర్ నౌకా సేవలు తాత్కాలికంగా రద్దు చేశారు. సముద్రపు గాలుల వేగం అధికంగా ఉండడంతో, నాగై-శ్రీలంక మధ్య నడుపుతున్న 'శివగంగ' ప్యాసింజర్ నౌకా సేవలు శనివారం నుంచి ఈ నెల 18వ తేది వరకు తాత్కాలికంగా నిలిపివేసినట్లు నౌకా సంస్థ ప్రకటన విడుదల చేసింది.

భవానీసాగర్, వైగై డ్యాంల నుంచి సాగునీరు విడుదల

పెరంబూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా భవానీ సాగర్ డ్యాం నుంచి సాగు నీటిని సోమవారం నుంచి అక్టోబరు 13వ తేది వరకు 120 రోజులపాటు విడుదల చేయనున్నారు. ఈ కారణంగా ఈరోడ్ జిల్లాల్లోని భవానీ, ఈరోడ్, మెడకుర్చి, కొడుముడి తాలూకాల్లోని 15,743 ఎకరాలకు నీరందనుంది. అలాగే, వైగై డ్యాం నుంచి సాగునీటిని ఆదివారం నుంచి అక్టోబరు 12వ తేది వరకు 75 రోజులు నీరు విడుదల చేయనున్నారు. దిండుగల్ జిల్లా నీలకోట తాలూకా, మదురై జిల్లా వాడిపట్టి తాలూకా పరిధిలోని 45,041 ఎకరాలకు సాగు నీరు అందుతుందని జలవనరుల శాఖ కార్యదర్శి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

వెటర్నరీ కోర్సులకు 20,317 దరఖాస్తులు

పెరంబూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యూజీ వెటర్నరీ కోర్సులకు ఇప్పటివరకు 20,317 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20వ తేది వరకు అవకాశం ఉండడంతో ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. తమిళనాడు పశువైద్య సైన్స్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో చెన్నై, నామక్కల్, తిరునల్వేలి, ఒరత్తనాడు, సేలం తలైవాసల్, ఉడుమలైపేట, తేని వీరపాండి తదితర 7 పశువైద్య కళాశాలలున్నాయి. ఈ కళాశాలల్లో బీవీఎస్సీ ఏహెచ్ కోర్సులో 660 సీట్లు, తిరువళ్లూర్ జిల్లా కొడువెలి కళాశాలలో రెండు కోర్సులకు మొత్తం 609 సీట్లు, హోసూరు కళాశాలలో 40 సీట్లున్నాయి. ఈ నెల 20వ తేది సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు సమర్పించవచ్చని వర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

'ఉత్తమ గ్రంథం' పురస్కారానికి దరఖాస్తు గడువు పెంపు

పెరంబూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తమిళ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 2024వ సంవత్సరానికి 'ఉత్తమ గ్రంథం' పురస్కారానికి దరఖాస్తు స్వీకరణ జూలై 15వ తేది వరకు పొడిగించారు. ఈ మేరకు తమిళ అభివృద్ధి డైరెక్టర్ ఎన్.అరుళ్ విడుదల చేసిన ప్రకటనలో... 2024వ సంవత్సరానికి ఉత్తమ గ్రంథం పురస్కారానికి 2024, జనవరి 1 నుంచి డిసెంబరు 12వ తేది వరకు ఆవిష్కరించిన గ్రంథాలు, చిన్న కథలు, నాటకాలు, బాల సాహిత్యం, క్రీడలు సహా 33 విభాగాల్లో పురస్కారాలు అందజేయనున్నారు. ఒక్కో విభాగంలో ఉత్తమ గ్రంథం ఎంపిక చేసి రచయితకు రూ.50 వేలు, ప్రచురణకర్తకు రూ.25 వేలు పురస్కారం అందజేయనున్నారు. దరఖాస్తుతో పాటు ఆయా గ్రంథాలు ఐదు ప్రతులు, రూ.100 రుసుముతో జూలై 15వ తేదిలోగా ఎగ్మూర్‌లోని తమిళ అభివృద్ధి కార్యాలయంలో సమర్పించాలి. మరిన్ని వివరాలకు 044-28190412, 28190413 అనే నెంబర్లు సంప్రదించవచ్చని డైరెక్టర్ తెలిపారు.

16 నుంచి యూ ట్యూబ్ ఛానల్‌పై శిక్షణ

పెరంబూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యూ ట్యూబ్ ఛానల్ ప్రారంభంపై ఈ నెల 16 నుంచి 18వ తేది వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈకాట్టుతాంగళ్‌లోని సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులు జరుగనున్నాయి. యూ ట్యూబ్ ఛానల్ ప్రారంభం, అవసరమైన సాఫ్ట్‌వేర్, వీడియోలు, ఫొటోలు అప్‌లోడ్, మార్కెటింగ్ సహా పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన 18 ఏళ్లకు పైబడిన వారు (మహిళలు, పురుషులు) ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. శిక్షణలో పాల్గొనే అభ్యర్థులకు తక్కువ అద్దెతో బస వసతి కల్పించనున్నారు. ఆసక్తి కలిగిన వారు www.editn.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు 9543773337, 9360221280 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

మదురై నుంచి అబుదాబీకి విమానసేవలు

టి.నగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మదురై నుండి అబుదాబీకి విమానసేవలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మదురై విమానాశ్రయం నుండి ప్రస్తుతం శ్రీలంక, దుబాయ్‌కి మాత్రమే విమానాలు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఇండిగో విమాన సంస్థ మదురై నుండి అబుదాబీకి విమానసేవలను ప్రారంభించింది. శుక్రవారం ఉదయం 11.20 గంటలకు అబుదాబీ నుండి బయలుదేరిన విమానం మధ్యాహ్నం 1.15 గంటలకు 134 మంది ప్రయాణికులతో మదురై విమానాశ్రయం చేరింది. మధ్యాహ్నం 2.48 గంటలకు మదురై నుండి 174 మంది ప్రయాణికులతో ఆ విమానం అబుదాబీకి బయలుదేరింది. సోమ, బుధ, శుక్రవారాల్లో ఈ విమానసేవలను పొందవచ్చునని ఇండిగో సంస్థ అధికారులు తెలిపారు. సాధారణంగా కొత్త విమానసేవలు ప్రారంభమవుతున్నప్పుడు ఆ విమానాలకు ఇరువైపులా ఫోర్సింగ్ పైప్‌ల ద్వారా నీటిని చల్లటం ఆనవాయితీ. అయితే అహ్మదాబాద్‌లో ఎయిర్‌ఇండియా విమాన ప్రమాద నేపథ్యంలో మదురై విమానాశ్రయంలో ఎలాంటి వేడుకలు లేకుండా అబుదాబీ విమానసర్వీసును ప్రారంభించారు.

సమైక్యతకు ప్రతీకగా చేపలవేట



వాగులో చేపలు పడుతున్న గ్రామస్థులు



తమకు లభించిన చేపలతో యువకులు

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా మేలూరు సమీపంలోని తిరువాదవూరు తిరుమరైనాథర్ వేదనాయకి అమ్మవారి ఆలయం సమీపంలోని చోళప్పేరి వాగులో శనివారం ఉదయం చేపలవేట తిరునాళ్లు అత్యంత వైభవంగా జరిగాయి. మేలూరు ప్రాంతంలోనే అతి పెద్దదైన ఈ వాగు ద్వారా చుట్టుపక్కలి గ్రామాల్లో సుమారు 500 ఎకరాలకు సాగునీటిని విడుదల చేస్తుంటారు. ప్రతియేటా వ్యవసాయ పనులు, పంట కొతలు ముగిసిన తర్వాత ఈ వాగులో గ్రామంలోని వారంతా కులమతాలకు అతీతంగా సమైక్యంగా చేపలు పట్టడం ఆనవాయితీ. ఆ మేరకు ఇటీవలే తిరువాదవూరు పరిసర ప్రాంతాల్లో సాగుపనులన్నీ పూర్తికావటంతో శనివారం ఉదయం ఆ వాగులో అందరై చేపలవేట జరపాలని గ్రామ పెద్దలు దండోరా వేయించారు. ఆ ప్రకారం తిరువాదవూరు, మేలూరు ప్రాంతాలకు చెందినవారే కాకుండా, పుదుకోట, తిరుచ్చి, దిండుగల్ జిల్లాల నుండి కూడా వందలాదిమంది చేపలు పట్టేందుకు వాహనాల్లో తరలివచ్చారు. శనివారం వేకువజాము నాలుగు గంటలకు గ్రామపెద్దలు ద్రౌపతి అమ్మవారి ఆలయం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాల నడుమ బాణసంచా పేల్చుతుండగా చోళప్పేరి వాగు వద్దకు చేరారు. తెల్ల జెండా ఊపిన అనంతరం ప్రజలంతా పోటీపడి వాగులోకి దిగి చేపల వేట ప్రారంభించారు. పలురకాల నాటు చేపలు చిన్న, పెద్ద సైజుల్లో లభించాయి. గ్రామస్థులంతా తాము పట్టిన చేపలను వండి చుట్టుపక్కల వారికి, పేదలకు పంచిపెట్టారు. మొత్తానికి ఈ చేపలవేట వేడుకలు కులమతాలకు అతీతంగా సమైక్యతకు ప్రతీకగా సాగిందనటం అతిశయోక్తి కాదు.

కూటమి పార్టీల సీట్లపై ఈపీఎస్ నిర్ణయం

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేపీ రామలింగం

అడయార్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్యులైన పార్టీలకు ఎన్ని సీట్లు కేటాయించాలని అనే విషయమై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నిర్ణయం తీసుకుంటారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేపీ రామలింగం తెలిపారు. సేలం నెడుంజాలై నగర్‌లోని ఇంట్లో పళనిస్వామితో శనివారం కేపీ రామలింగం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేపీ రామలింగం మీడియాతో మాట్లాడుతూ... 2026 శాసనసభ ఎన్నికల్లో డీఎంకే ఓడించడమే అందరి లక్ష్యమన్నారు. అందుకోసం బీజేపీ శ్రేణులు తీవ్రంగా కృషి చేస్తాయని, ఎడప్పాడి పళనిస్వామిని ముఖ్యమంత్రిని చేస్తామని తెలిపారు.

హోంవర్క్ చేయలేదని మందలింపు

పాఠశాల భవనంపై నుంచి దూకిన విద్యార్థి

పెరంబూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): హోంవర్క్ చేయలేదని టీచర్ మందలించడంతో పాఠశాల భవనంపై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటన తూత్తుకుడి జిల్లాలో చోటుచేసుకుంది. తిరుచెందూర్ సుబ్రమణ్యపురం ప్రాంతానికి చెందిన ప్రభాకర్‌కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమారుడు ఆకాష్ ఓ ప్రైవేటు మెట్రిక్యులేషన్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఆకాష్ శుక్రవారం పాఠశాలకు వెళ్లగా హోంవర్క్ చేయకుండా వచ్చాడని మందలించిన టీచర్, అతడిని క్లాసు రూం బయట నిలబడాలని ఆదేశించింది. దీంతో, మనస్తాపం చెందిన ఆకాష్, పాఠశాల మొదటి అంతస్తు నుంచి కిందకు దూకాడు. పాఠశాల ప్రిన్సిపాల్, ఆకాష్ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు వెంటనే వెళ్లి ఆకాష్‌ను తిరుచెందూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తిరుచెందూర్ తాలూకా పోలీసులు కేసు నమోదుచేసి పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు.

పోలీస్ స్టేషన్‌నే కాపాడలేని వారు ప్రజలకు రక్షణ కల్పిస్తారా...?

● డీఎంకే ప్రభుత్వంపై ఈపీఎస్ ఆగ్రహం


పెరంబూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌ను కాపాడలేని డీఎంకే ప్రభుత్వం, ప్రజలకు ఎలా రక్షణ కల్పిస్తుందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ పేజీలో... డీఎంకే ప్రభుత్వంలో పోలీస్ స్టేషన్లకే భద్రత కరువైందన్నారు. పోలీస్ స్టేషన్లను రక్షించలేని ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రజలకు ఎలా భద్రత కల్పిస్తారని ప్రశ్నించారు. మదురై జిల్లా తిరుమంగళంలోని ఓ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తుల స్టేషన్ ధ్వంసం చేశారనే వార్త దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. అనంతరం శాసనసభ ప్రతిపక్ష ఉప నేత ఆర్బీ ఉదయకుమార్ ఆ పోలీస్ స్టేషన్ పరిశీలించేందుకు వెళ్లగా, పోలీసులు ఆయనను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు ముఖ్యమంత్రి నాలుగేళ్ల పాలనలోని విజయాల్లో తొలుత చేర్చాల్సిన సాధన ఇదేనన్నారు.

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ శిక్ష

పెరంబూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. తిరుచెందూర్ అమలి నగర్ ప్రాంతానికి చెందిన బాబు 2014 మే 22వ తేది హత్యకు గురైన కేసులో అదే ప్రాంతానికి చెందిన టోరన్స్, షియాస్టన్, ఆంతోనిసిరియల్‌ను తిరుచెందూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు తూత్తుకుడి జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టులో ముగిసిన నేపథ్యంలో, నిందితులు టోరన్స్, షియాస్టన్, ఆంథోని సిరియల్‌కు యావజ్జీవ జైలు శిక్ష, రూ.15 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శుక్రవారం తీర్పు వెలువరించారు.

పెరిగిన అమరావతి డ్యాం నీటిమట్టం

● వరద హెచ్చరిక చేసిన కలెక్టర్



నిండిన అమరావతి డ్యాం

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లాలోని అమరావతి డ్యాంలో నీటి మట్టం విపరీతంగా పెరుగుతుండటంతో జలాశయానికి సమీపంలో ఉన్న ప్రాంతాలల్లో వరదముప్పు సంభవించే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ క్రీస్తురాజ్ హెచ్చరికలు చేశారు. ఆ డ్యాంలో 90 అడుగుల వరకు నీటిని నిల్వ చేయడానికి వీలుండగా ప్రస్తుతం 86 అడుగుల మేర నీటిమట్టం పెరిగిందని, ప్రస్తుతం డ్యాం పరిసరాల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తుండటంతో నీటిమట్టం ప్రమాద స్థితికి చేరుకుంటే అదనపు జలాలను విడుదల చేయాల్సి వస్తుందన్నారు. ఈ పరిస్థితులలో ఆ జలాశయానికి చేరువగా ఉన్న పల్లపు ప్రాంతాల్లో నివసిస్తున్నవారంతా సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళాలని కలెక్టర్ ఆదేశించారు.

పరందూరు రైతులతో విజయ్ భేటీ

● పోరాటానికి మద్దతు తెలిపిన నటుడు



పార్టీ కార్యాలయంలో పరందూరు రైతు సంఘాల నాయకులు, ఉద్యమకారులతో చర్చిస్తున్న విజయ్

టి.నగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పరందూరు ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక ఉద్యమ కమిటీ సభ్యులు, రైతులు శుక్రవారం రాత్రి తమిళగవెట్రి కళగం అధ్యక్షుడు విజయ్‌ను కలుసుకున్నారు. కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూరు సమీపంలోని పరందూరులో రెండో విమానాశ్రయం నిర్మించేందుకు అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.. ఈ కొత్త విమానాశ్రయ నిర్మాణానికి కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, ఆర్థిక వ్యవహారాల శాఖ, విమానాశ్రయాల ఆర్థిక నియంత్రణా మండలి, భారత వాతావరణ పరిశోధనా శాఖ తదితర శాఖలు ఇప్పటికే ప్రాథమిక స్థాయి అనుమతులిచ్చాయి ఈ విమానాశ్రయం కోసం పరందూరు, ఏకనాపురం సహా మొత్తం 13 గ్రామాలకు చెందిన స్థలాలను సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఈ భూములలో చెరువులు, కొలనులు, వ్యవసాయ భూములు, ప్రభుత్వ పొరంబోకు స్థలాలున్నాయి. విమానాశ్రయం కోసం పంట భూములు ఎక్కువగా ఉన్న ఏకనాపురం తదితర గ్రామాల్లో స్థలాల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కనుకనే ఏకనాపురం గ్రామాన్ని ప్రధానకేంద్రంగా చేసుకుని వెయ్యిరోజులకు పైగా 13 గ్రామాల ప్రజలు ఆందోళన జరుపుతున్నారు. వీరికి పలు రాజకీయ పార్టీలు, సంస్థలు మద్దతు ప్రకటించాయి. తమిళగ వెట్రి కళగం నాయకుడు విజయ్ గత జనవరిలో పరందూరు వెళ్ళి ఉద్యమకారుల ఆందోళనకు మద్దతు ప్రకటించారు. ఈ నేపథ్యంలో విజయ్‌ని పనయూరులోని టీవీకే కార్యాలయంలో పరందూరు విమానాశ్రయ వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు జి.సుబ్రమణియన్ నాయకత్వంలో రైతులు, 13 గ్రామాల ప్రతినిధులు కలుసుకున్నారు. విమానాశ్రయం ఏర్పాటును వ్యతిరేకిస్తూ పరందూరు ప్రజలు సాగిస్తున్న ఉద్యమం విజయం సాధించాలని కోరుకుంటున్నానని, ఈ ఉద్యమానికి టీవీకే గట్టి మద్దతునిస్తుందని విజయ్ ప్రకటించారు.

పోలీస్‌స్టేషన్‌లో నిందితుడి విధ్వంసకాండ

● ధర్నాకు సిద్ధమైన మాజీ మంత్రి అరెస్టు



అరెస్టయిన ఉదయకుమార్

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మదురై సమీపంలో వి.సత్రపట్టి పోలీసులు తనకు బదులుగా తండ్రిని విచారణకు పిలిచారనే ఆగ్రహంతో ఓ నిందితుడు పోలీసుస్టేషన్‌లో ప్రవేశించి. విధ్వంసకాండకు దిగాడు. స్టేషన్‌లోని వస్తువులను పగులగొట్టి ట్యూటీ చేస్తున్న పోలీసులను సైతం భయభ్రాంతులకు గురిచేశాడు. దీనిని ఖండిస్తూ పార్టీ శ్రేణులతో ధర్నాకు సిద్ధమైన మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఓ హత్యకేసు విచారణ నిమిత్తం ప్రభాకరన్ అనే నిందితుడి ఇంటికి శుక్రవారం సాయంత్రం పోలీసులు వెళ్ళారు. ఆ సమయంలో ప్రభాకరన్ లేకపోవడంతో అతడి తండ్రిని విచారణ నిమిత్తం పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రభాకరన్ ఆగ్రహంతో తన అనుచరులతో కలిసి పోలీసుస్టేషన్‌లోని ఫర్నిచర్ సహా వస్తువులను పగులగొట్టి నానాబీభత్సం సృష్టించాడు. ఆ సమయంలో స్టేషన్‌లో ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్ల భయంతో సెల్‌లోకి వెళ్లి గడియపెట్టుకున్నారు. ఈ సంఘటన తెలుసుకున్న మాజీ మంత్రి ఉదయకుమార్ తన అనుచరులతో కలిసి డీఎంకే పాలనలో పోలీసుస్టేషన్‌కే భద్రతలేదని నినాదాలు చేస్తూ ధర్నాకు ప్రయత్నించారు. పోలీసులు ఆయనను అరెస్టు చేసి తరలించారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అడయార్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

షోలింగనల్లూర్: పెరుంబాక్కం గ్లోబల్ హాస్పిటల్ మెయిన్ రోడ్డు కొంత భాగం, శేఖరన్ నగర్, శాంతి నగర్, ఆనందమ్మాళ్ నగర్, శ్రీ కృష్ణా నగర్, మాతా ఆలయ వీధి, మసీదు వీధి, రాధా నగర్, రామయ్య నగర్, మేడవాక్కం పుష్పా నగర్, పెరుమాళ్ ఆలయ కర్వ్, అప్పర్ వీధి, పిళ్లయార్ ఆలయ వీధి, పొన్నియమ్మన్ ఆలయ వీధి, భజన ఆలయ వీధి, పెరుమాళ్ ఆలయ వీధి, కుళక్కరై వీధి, దావూద్ నగర్ 1 నుంచి 3 వీధులు, లక్ష్మి అప్పాదురై వీధి, సాయి అయూష అపార్ట్‌మెంట్స్, రాక్ అమృత ఫ్లాట్స్, సోము నగర్, మురుగ ఆలయ కర్వ్, మందవెల్లి వీధి, కట్టబొమ్మన్న వీధి, పుష్పా నగర్ పార్క్, దేవి కరుమారి నగర్, శబరి నగర్, అయ్యప్ప నగర్, రామ్ చిత్ర అపార్ట్‌మెంట్స్, సూర్య నగర్, జయా నగర్, చైతన్య కాలనీ, పోస్టాఫీసు, సత్యసాయి నగర్

వేళచ్చేరి: దేవ్ ఫ్లాట్, అంతోనియార్ వీధి, తిరువళ్లువర్ వీధి, కంబర్ వీధి, బాబా గార్డన్, సాయి గార్డన్, వీజీసీ సెల్వ నగర్

కడప్పేరి: పిళ్లయార్ ఆలయ వీధి, చంద్ర నగర్, నాగప్ప నగర్, సీఎల్సీ వర్క్స్ రోడ్డు, న్యూ కాలనీ, చిట్లపాక్కం తిరువిక నగర్ మెయిన్ రోడ్డు, సర్వమంగళ నగర్, హరిదాస్‌పురం మెయిన్ రోడ్డు, ఛత్రపతి శివాజీ వీధి, మౌలానా నగర్, అర్పుతం నగర్, నాగరత్నం నగర్, రామతిలకం వీధి, అమ్మన్ ఆలయ వీధి, జెరూసలేం నగర్, భజన ఆలయ వీధి, స్కూల్ వీధి, మిడిల్ స్ట్రీట్, ఈస్ట్ స్ట్రీట్, టీఎం రోడ్డు, పులికురడు పుదుతాంగళ్ ముల్లై నగర్, అంబేడ్కర్ వీధి, వైగై నగర్, గాంధీ నగర్, పాత స్టేట్ బ్యాంక్ కాలనీ, కామరాజ్ వీధి, గాంధీ రోడ్డు కొంత భాగం

అంబత్తూర్: జస్వంత్ నగర్ ఫేస్ 1,2, బాబా నగర్, ఏబీటీఈపీ నగర్, మీనాక్షి అవెన్యూ, రెడ్డిపాళయం రోడ్డు.

16,19 తేదీల్లో సెంట్రల్-సూళ్లూరుపేట రైళ్ల రద్దు

పెరంబూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కవరపేట-గుమ్మిడిపూండి మార్గంలో మరమ్మతుల కారణంగా చెన్నై సెంట్రల్-గూడూరు మధ్య ఈ నెల 16,19 తేదీల్లో సబర్బన్ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

● సెంట్రల్ నుంచి ఉదయం 10.30, 11.15 గంటలకు గుమ్మిడిపూండి వెళ్లే సబర్బన్ రైళ్లు, గుమ్మిడిపూండి నుంచి మధ్యాహ్నం 1, 2.30, 3.15 గంటలకు సెంట్రల్ వెళ్లే సబర్బన్ రైళ్లు రద్దు.

● సెంట్రల్ నుంచి ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10, 1.05 గంటలకు సూళ్లూరుపేట వెళ్లే సబర్బన్ రైళ్లు, సూళ్లూరుపేట నుంచి మధ్యాహ్నం 1.15, 3.10, రాత్రి 9 గంటలకు సెంట్రల్‌కు వెళ్లే సబర్బన్ రైళ్లు రద్దు.

● చెన్నై బీచ్ నుంచి ఉదయం 9.40, మధ్యాహ్నం 12.40 గంటలకు గుమ్మిడిపూండి వెళ్లే సబర్బన్ రైళ్లు, గుమ్మిడిపూండి నుంచి ఉదయం 10.55 గంటలకు చెన్నై బీచ్‌కు వెళ్లే సబర్బన్ రైలు రద్దు.

● సూళ్లూరుపేట నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు నెల్లూరు వెళ్లే సబర్బన్ రైలు, నెల్లూరు నుంచి సాయంత్రం 6.45 గంటలకు సూళ్లూరుపేట వెళ్లే సబర్బన్ రైలు రద్దు. అలాగే, సెంట్రల్ నుంచి రాత్రి 11.40 గంటలకు ఆవడి వెళ్లే సబర్బన్ రైలు రద్దు.

ప్రత్యేక రైళ్లు... : సబర్బన్ రైళ్ల రద్దు కారణంగా ప్రయాణికుల సౌకర్యార్థం సెంట్రల్-పొన్నేరి మధ్య ఉదయం 10.30, సెంట్రల్-మీంజూరు మధ్య ఉదయం 11.35, చెన్నై బీచ్-పొన్నేరి మధ్య మధ్యాహ్నం 12.40, పొన్నేరి-సెంట్రల్ మధ్య మధ్యాహ్నం 1.18, 3.33, మీంజూరు-సెంట్రల్ మధ్య మధ్యాహ్నం 2.59 గంటలకు ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే తెలియజేసింది.

● మురుగన్ భక్తుల మహానాడు ...

పలు నిబంధనలతో పోలీసుల అనుమతి



మదురై రింగ్‌రోడ్డులో మురుగన్ భక్తుల మహానాడుకు జరుగుతున్న ఏర్పాట్లు

టి.నగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మదురైలో హిందూ మున్నాని ఆధ్వర్యంలో ఈ నెల 22 నిర్వహించనున్న మురుగన్ భక్తుల మహానాడుకు పోలీసుశాఖ 52 నిబంధనలు విధించింది. ఆ మహానాడు ఏర్పాట్లపై సమగ్రమైన నివేదిక అందజేయాలంటూ ఆదేశాలిచ్చింది. మదురై రింగ్ రోడ్డులో మురుగ భక్తుల మహానాడు కోసం వేదిక నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ మహానాడు ప్రాంతంలో సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల నమూనాలను కూడా నిర్మిస్తున్నారు. ఈ మహానాడు జరిపేందుకు అనుమతి కోరటానికి మదురై మహానగర పోలీసుశాఖ అధికారులను నిర్వాహకులు సంప్రదించగా 52 నిబంధనలు పాటించాలంటూ ఆదేశాలిచ్చారు. ఈ విషయమై పోలీసు అధికారులు మాట్లాడుతూ హిందూ మున్నాని జరుపనున్న ఈ మహానాడుకు రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు కూడా రానున్నారని, వీరందరికి మహానాడు నిర్వాహకులు వివిధ రంగుల్లో ముద్రించిన అనుమతి కార్డులు ఇవ్వాలని, వేర్వేరుగా పార్కింగ్ సదుపాయాలు కూడా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మహానాడుకు వచ్చే వీఐపీలకు మహానాడు వేదిక వద్ద ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, మహానాడు ప్రాంతానికి చేరుకునేందుకు పలు ప్రవేశద్వారాలు కూడా ఏర్పాటు చేసి, ప్రతి ప్రవేశద్వారం వద్ద మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేసినమీదటే భక్తులను లోపలకు అనుమతించాలన్నారు. లక్షమందికిపైగా భక్తులు విచ్చేస్తారని నిర్వాహకులు చెబుతుండటంతో వారి కోసం అధిక సంఖ్యలో మరుగుదొడ్లు, వైద్యశిబిరాలు, అత్యవసర వాహనాలు, తాగు నీటి సదుపాయం సమకూర్చాలని పోలీసులు ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుండి ఈ మహానాడు ఎన్ని వాహనాలు వస్తాయో తమకు ముందుగా వివరాలు తెలపాలని కూడా పోలీసులు శాఖ నిబంధన విధించింది. ఈ మహానాడు నిర్వహణకు కార్పొరేషన్ అనుమతి తీసుకోవాలని, మహానాడు ప్రాంతంలో ఆహార పదార్థాలను పంపిణీ చేయడానికి ఆహార భద్రతాధికారుల అనుమతి తప్పనిసరి అని తెలిపారు. విద్యార్థులు, గర్భిణులు, వృద్ధులు మహానాడులో పాల్గొనకుండా కట్టుదిట్టం చేస్తే మంచిదని కూడా పోలీసులు నిర్వాహకులకు సలహా ఇచ్చారు. రింగ్‌రోడ్డు వద్ద మహానాడు జరుపనుండటం వల్ల వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా పోలీసులకు సహకరించాలనే నిబంధన కూడా విధించింది. ఇదిలా ఉండగా మహానాడు ప్రాంతం వద్ద ఆరుపడై వీడుగళ్ సెట్టింగ్ నిర్మించేందుకు పోలీసులు అనుమతి నిరాకరించగా, హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ న్యాయమూర్తి పి. పుగళేంది మహానాడు ప్రాంగణం వద్ద ఆరుపడైవీడుగల్ సెట్టింగ్ నిర్మించి వాటిలో పూజలు కూడా చేసుకోవచ్చని తన ఉత్తర్వులో పేర్కొన్నారు. అదే సమయంలో పోలీసుశాఖ నిబంధనలను మహానాడు నిర్వాహకులు విధిగా పాటించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

లంచం ఇవ్వాలంటూ బెదిరింపులు

● డీఎస్పీ సహా ముగ్గురిపై కేసు

పెరంబూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): లారీ యజమానిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన వ్యవహారంలో డీఎస్పీ సహా ఇద్దరు కానిస్టేబుళ్లపై ఏసీబీ కేసు నమోదు చేసింది. తూత్తుకుడి జిల్లా మనియాచ్చి డీఎస్పీగా లోకేశ్వరన్ 2022 ఆగస్టు నుంచి 2024 ఆగస్టు వరకు పనిచేశారు. ఆయన కార్యాలయంలో ఒట్టపిడారం పోలీసులు ప్రభాకరన్, బసువందిని, శరవణన్ తదితరులు పనిచేస్తున్నారు. వీరంతా 2023లో పులియంపట్టికి చెందిన మహారాజన్‌కు చెందిన లారీలో ఎర్ర మట్టి తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. ఆ లారీ వదలాలంటే డీఎస్పీకి రూ.లక్ష, వారందరికీ రూ.50 వేలు ఇవ్వాలని బెదిరించడంతో, అతడు రూ.లక్ష అందజేసి లారీ విడిపించుకున్నాడు. ఈ విషయమై మహారాజన్ డీఎస్పీ లోకేశ్వరన్‌ను స్వయంగా కలిసి ఫిర్యాదు చేసి, రూ. లక్ష తిరిగిప్పించాలని కోరాడు. ఈ విషయమై డీఎస్పీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిసింది. దీంతో, మహారాజన్ తన కుటుంబ సభ్యులతో కలసి డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో, డీఎస్పీ లోకేశ్వరన్, ఇద్దరు పోలీసుల ద్వారా రూ. లక్ష తిరిగి అందజేసి పంపించారు. ఈ వ్యవహారంపై తూత్తుకుడి ఏసీబీ అధికారులు విచారణ చేపట్టి ప్రభుత్వ అనుమతితో ప్రస్తుతం చెన్నై సైబర్ క్రైం డీఎస్పీగా పనిచేస్తున్న లోకేశ్వరన్, కులశేఖరపట్టణం స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రభాకరన్, తిరుచెందూర్ తాలూకా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న శరవణన్‌లపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

రూ.1.30 కోట్ల బంగారం దోపిడీ

● దుండగుల కోసం గాలింపు

ప్యారీస్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల నగరం కోయంబత్తూరులో కారులో వెళుతున్న జువెలరీ షాపు యజమాని వద్ద రూ.1.30 కోట్ల విలువైన 1.250 కిలోల బంగారాన్ని కారు సహా దొంగిలించిన ముఠా కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేరళ రాష్ట్రానికి చెందిన జైసన్ అనే జువెలరీ షాపు యజమాని, తన దగ్గర పనిచేస్తున్న విష్ణుతో కలిసి నగలను కోయంబత్తూరులో వున్న జువెలరీ షాపులకు సరఫరా చేసేందుకు శనివారం ఉదయం కారులో బయలుదేరిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కారును అడ్డగించి కత్తితో బెదిరించి, ఇద్దరినీ కారునుంచి దించివేసి గాయపరచారు. అనంతరం బంగారంతో కారులో పరారయ్యారు. జైసన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రైలు ఢీకొని ఐటీ ఉద్యోగి మృతి

ప్యారీస్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా వండలూరులో పట్టాలు దాటుతుంగా రైలు ఢీకొనడంతో ఐటీ ఉద్యోగి మృతిచెందినట్లు ఆర్పీఎఫ్ అధికారులు తెలిపారు. వండలూరు సింగారం గార్డెన్స్‌కు చెందిన పూర్ణిమ (24) పెరుంగలుత్తూరు ప్రాంతంలోని ఓ ఐటీ కంపెనీలో రెండేళ్ళు పనిచేస్తోంది. మధ్యాహ్నం భోజనం సమయంలో ఆమె కంపెనీ నుంచి ఇంటికి వెళ్ళి తన ఆరు నెలల బిడ్డకు పాలు పట్టించి తిరిగి విధులకు వస్తోంది. ఆ రీతిలో శుక్రవారం మధ్యాహ్నం ఇంటికెళ్ళేందుకు వండలూరు సమీపంలోని రైలు పట్టాలు దాటుతుండగా సబర్బన్ రైలు ఢీకొనడంతో పూర్ణిమ అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

నకిలీ న్యాయవాదుల అరెస్టు



నకిలీ లాయర్లు కృష్ణమూర్తి, కవిత

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్హతకు సంబంధించిన నకిలీ రికార్డులు సమర్పించి నగరంలోని బార్ కౌన్సిల్‌లో న్యాయవాదులుగా రిజిస్టర్ చేసుకునేందుకు ప్రయత్నించిన మదురై తిరుమంగళం ప్రాంతానికి చెందిన కవిత, సేలంకు చెందిన కృష్ణమూర్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ ఇరువురు ఢిల్లీలోని ఓ విశ్వవిద్యాలయంలో లా చదివినట్లు సమర్పించిన ధ్రువ పత్రాలను బార్‌కౌన్సిల్ అధికారులు పరిశీలించగా, అవి నకిలీవని తేలాయి. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు చెప్పడంతో వారు బార్ కౌన్సిల్ కార్యాలయానికి వచ్చి ఇద్దరిని అరెస్టు చేశారు.

ప్రయాణికురాలి నుంచి తూటా స్వాధీనం

అడయార్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కోవై విమానాశ్రయంలో మహిళా ప్రయాణికురాలి నుంచి తుపాకి తూటాను సీఐఎస్ఎఫ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఉదయం 6.30 గంటలకు బెంగళూరు వెళ్లే ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రయాణికులను సీఐఎస్ఎఫ్ అధికారులు యథావిధిగా స్కానర్ ద్వారా తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఓ ప్రయాణికురాలు బ్యాగులో బుల్లెట్ ఉన్నట్లు అలారమ్ మోగింది. దీంతో, ఆ ప్రయాణికురాలిని ప్రత్యేక గదిలోకి తీసుకెళ్లి తనిఖీ చేయగా, ఆమె వద్ద 9 ఎంఎం రకం తుపాకి తూటా లభ్యమైంది. ఆమె కోవైకి చెందిన ప్రముఖ ట్రస్టీ భార్య అని, బెంగళూరు వెళ్లే హడావుడిలో తూటా ఉన్నట్లు గుర్తించకుండా బ్యాగు తీసుకొచ్చినట్లు తెలిసింది. దీంతో, ఆమె ప్రయాణాన్ని అధికారులు రద్దు చేశారు.

నలుగురు బంగ్లాదేశీయుల అరెస్టు

అడయార్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్‌లో చట్టవిరుద్ధంగా ఉంటున్న నలుగురు బంగ్లాదేశీయులను పోలీసులు అరెస్ట్ చేశారు. సెన్నిమలై, పరిసర ప్రాంతాల్లో బంగ్లాదేశ్‌కు చెందిన వారు చట్టవిరుద్ధంగా నివశిస్తూ కర్మాగారాల్లో పనిచేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. శుక్రవారం ఉదయం సాయంత్రం వరకు పోలీసులు, క్యూ బ్రాంచ్ పోలీసులు సెన్నిమలై, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. తనిఖీల్లో, బంగ్లాదేశ్‌కు చెందిన మహ్మద్ నయీమ్ హుస్సేన్, మహ్మద్ షైనర్ హుస్సేన్, మహ్మద్ డొరికుల్ ఇస్లామ్, మహ్మద్ ఖుద్దీస్ చట్టవిరుద్ధంగా బసచేస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

శాంతను - అంజలి జంటగా 'మెజెంటా'



కొత్త చిత్రం ప్రారంభోత్సవ దృశ్యం

చిత్రజ్యోతి

శాంతను భాగ్యరాజ్ - అంజలీ నాయర్ జంటగా 'మెజెంటా' పేరుతో ఓ కొత్త చిత్ర ప్రారంభమైంది. భరత్ మోహన్ దర్శకత్వం వహించే ఈ చిత్రాన్ని బ్రాండ్ బ్లిట్జ్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై డాక్టర్ జేపీ లీలా రామ్, రేఖా లీలారామ్, రాజు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ తాజాగా పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. మంచి వినోదాత్మక చిత్రాన్ని నిర్మించాలన్న లక్ష్యంతో చిత్రపరిశ్రమలోకి బ్రాండ్ బ్లిట్జ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ప్రవేశపెట్టింది. ఈ నిర్మాణ సంస్థ 'మెజెంటా' పేరుతో తొలి చిత్రానికి శ్రీకారం చుట్టింది. పవర్‌ఫుల్ రొమాంటిక్ కామెడీ చిత్రంకానుంది. ఈ మూవీలో బడవ గోపి, ఆర్‌జే ఆనంది, బగ్స్ తదితరులు నటించారు. తాజాగా జరిగిన ఈ సినిమా పూజా కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని చిత్ర బృందానికి అభినందించారు. చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ, "మెజెంటా' చిత్రం రొమాన్స్, కామెడీ జోనర్‌లో రూపొందిస్తున్నాం. మా తొలి చిత్రంగా 'మెజెంటా' ఉండటం చాల సంతోషంగా ఉంది. దర్శకుడు భరత్ మోహన్ చెప్పిన కథ బాగా నచ్చింది. చెన్నైతో సహా అందమైన లొకేషన్లలో షూటింగ్ జరుపుకోనున్నాం' అని పేర్కొన్నారు. దర్శకుడు భరత్ మోహన్ మాట్లాడుతూ, 'సూర్యోదయం, సూర్యాస్తమ సమయాలను చూస్తున్నాం. ఈ రెండు సమయాలు ఒకేసారి కలుసుకోవు. కానీ, విశ్వం ఆ నీడను ఒక సమయంలో కలుపుతుంది' ఈ పాయింట్‌తోనే ఈ మూవీ తెరకెక్కిస్తున్నాం' అని పేర్కొన్నారు.

శింబుతో ప్రేమలో ఉన్నట్టా? లేనట్టా?



● నిధి ఏమన్నారు?

కోలీవుడ్ మోస్ట్ బ్యాచిలర్ హీరో శింబు ప్రేయసిల జాబితా చాలా ఉంది. వారిలో నిధి అగర్వాల్ ఒకరనే ప్రచారం కోలీవుడ్‌లో సాగుతోంది. వీరిద్దరు కలిసి సుశీంద్రన్ దర్శకత్వంలో వచ్చిన 'ఈశ్వరన్' సినిమాలో నటించారు. ఆ సమయంలో వీరిద్దరూ ప్రేమలో పడినట్టు వార్తలు వచ్చాయి. అదేసమయంలో చెన్నైలోని శింబు ఇంటికి పదేపదే వెళ్లడం కూడా వీరిద్దరు ప్రేమలో ఉన్నారనేందుకు సాక్ష్యమని కోలీవుడ్ సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, గత కొంతకాలంగా వీరిద్దరి ప్రేమ విషయంపై పెద్దగా చర్చ సాగలేదు. గతంలో కాకుండా బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో ఎక్కువగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో 'హరిహర వీరమల్లు' సినిమా ప్రచారం కోసం చెన్నై వచ్చిన నిధి అగర్వాల్ వద్ద శింబుతో ప్రేమ వ్యవహార అంశాన్ని ప్రస్తావించగా, ఆమె వైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అంటే వీరిద్దరి మధ్య ప్రేమబంధం కొనసాగుతుందా? తెగిపోయిందా? అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. అదేసమయంలో శింబు సోదరుడు, సోదరికి మాత్రం పెళ్ళిళ్ళు అయి ఎంజాయ్ చేస్తున్నారు. శింబు మాత్రం ఇంకా బ్యాచిలర్‌గానే కొనసాగుతున్నారు.

కల్యాణ మండపం పూర్తి చేస్తాం

● విశాల్



నడిగర్ సంఘ భవన నిర్మాణ పనుల్లో భాగంగా మొదట కల్యాణ మండప నిర్మాణ పనులను పూర్తి చేస్తామని ఆ సంఘ ప్రధాన కార్యదర్శి, హీరో విశాల్ తెలిపారు. టి.నగర్‌లోని హబీబుల్లా రోడ్డులో నడిగర్ సంఘం కొత్త భవన నిర్మాణ పనులు సాగుతున్న విషయం తెల్సిదే. ఇందులోభాగంగా మొదట కల్యాణ మండపం, కల్చరల్ సెంటర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఈ పనులు ఇపుడు శరవేగంగా సాగుతున్నాయి. ఈ రెండు నిర్మాణాలను పూర్తి చేసి, మిగిలిన నిర్మాణాలను తర్వాత చేపట్టాలని భావిస్తున్నారు. ఇదిలావుంటే విశాల్ త్వరలోనే ఓ ఇంటివారు కాబోతున్న విషయం తెల్సిందే. హీరోయిన్ ధనిష్కతో ఆగస్టు 29వ తేదీ వివాహం జరగనుంది. అదేసమయంలో విశాల్ కూడా వరుస చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. గౌతం మేనన్, రవి అరసు దర్శకత్వాల్లో విశాల్ నటించనున్నారు. అలాగే, ధనిష్క కూడా 'యోగి దా' అనే చిత్రంలో నటించగా, ఇది విడుదలకు సిద్ధంగా ఉంది. అలాగే, మరికొన్ని చిత్రాల్లో నటించేందుకు కమిటైవున్నారు.

సాగరతీరం.. ఆహ్లాదకరం



రాక్ మెమోరియల్-తిరువళ్లువర్ విగ్రహం నడుమ అద్దాల వంతెన



● మూడు సముద్రాల సంగమం 'కన్నియాకుమారి'

వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి

తూర్పున బంగాళాఖాతం, పశ్చిమాన అరేబియా సముద్రం, దక్షిణాన హిందూ మహాసముద్రాలు కలిసే అందమైన ప్రదేశమే 'కన్నియాకుమారి' పుణ్యక్షేత్రం. సాక్షాత్తు పార్వతీదేవి అపర అంశగా వెలసిన 'కన్నియాకుమారి' దివ్యక్షేత్రం ఇది. అంతేకాదు ప్రకృతి దృశ్యాలతో యాత్రికులను ఆకట్టుకొనే మనోహరమైన పర్యాటక ప్రదేశం కూడా. మూడు సాగరాల సౌందర్యం ఒకేసారి చూడాలంటే కన్నియాకుమారికి వెళ్ళాల్సిందే. బంగాళాఖాతం నుంచి సూర్యోదయం, అరేబియా సముద్రంలో సూర్యాస్తమయం అద్భుతమైన దృశ్యాన్ని కళ్ల ముందు ఆవిష్కరిస్తాయి. ఆ దృశ్యాలను చూసేందుకు వచ్చే పర్యాటకులతో కన్యాకుమారి నేలయానిండా అన్నట్టుగా కనిపిస్తుంది. అడుగడుగునా ఆధ్యాత్మికతకు కొలువుగా, సుందర సుమనోహర దృశ్యాలకు నెలవుగా నిలిచిన ఈ పుణ్యక్షేత్రం 'కన్నియాకుమారి అగ్రం'గా కూడా పేరుగాంచింది. దీనినే 'కేప్ కొమొరిన్' అని పిలుస్తుంటారు. కన్నియాకుమారి ప్రాచీన పాండ్య రాజ్యంలో భాగంగా ఉండేదని, దేవి కుమారి పాండ్యరాజుల కులదేవతగా పూజింపబడిందని కొన్ని ప్రాచీన తమిళ గ్రంథాలు, శిలా శాసనాల ద్వారా తెలుస్తున్నది. వేల సంవత్సరాలకు పూర్వం భరతుడనే రాజర్షి ఈ అఖండ భారతదేశాన్ని పాలించాడు. అతడికి ఒక కుమార్తె, ఎనిమిది మంది కుమారులుండేవారు. కుమార్తె పేరు కుమారి. వృద్ధాప్య దశలో ఆ రాజు తన రాజ్యం మొత్తాన్ని తన సంతానానికి పంచాడు. అప్పుడు కన్నియాకుమారి భాగం కుమారికి సంక్రమిందని, ఆనాటి నుండి ఈ ప్రాంతానికి 'కన్నియాకుమారి' అనే పేరు వచ్చిందని ఒక కథనం. ఆ కాలంలో కన్నియాకుమారి కూడా ఒక పట్టణంగా ఉండేదని స్థానికులు చెబుతుంటారు. కన్నియాకుమారి ఆలయం చాలా పురాతనమైన మందిరమని, బలరాముడు, అర్జునుడు ఈ దేవాలయ దర్శనార్థం పాదయాత్ర చేస్తూ వచ్చారని ఒక ఇతిహాసం. కన్నియాకుమారి క్షేత్రంతో పరుశురాముడికి కూడా సంబంధమున్నట్లు చెబుతారు. ఒక్కడి ఆలయంలోని విగ్రహాన్ని సాక్షాత్తు పరుశురాముడే ప్రతిష్ఠించాడని ప్రతీతి. అమ్మవారి విగ్రహానికి ఉన్న వజ్రపు ముక్కుపుడకను కూడా పరుశురాముడే సమర్పించాడనే కథనం కూడా ప్రచారంలో ఉంది. దీనికి నిదర్శనంగా ఆలయ ప్రాంగణంలోని స్తంభాలలోని ఒకదానిపై పరుశురాముడి విగ్రహం దర్శించవచ్చు.

వివేకానంద రాక్ మెమోరియల్...

1892వ సంవత్సరంలో స్వామీ వివేకానంద ధ్యానం చేసిన ప్రదేశం. ఇక్కడినుండి 200 మీటర్ల దూరంలోవుండే సముద్రంలో భారీ రాయిపైన నిర్మితమై వివేకానంద స్మారక చిహ్నం ఉంటుంది. దీన్ని చూసేందుకు మరమడవలు ఎక్కి చేరుకోవాల్సివుంటుంది. ఇక్కడ 12అడుగుల ఎత్తులో ఉండే వివేకానందుడి కాంస్య విగ్రహం పర్యాటకులను ఆకర్షిస్తుంది. ఈ వివేకానందుడి రాక్ కు కొంతదూరంలో పార్వతీదేవి తపస్సు చేసిన ప్రాంతం ఉంది. ఇక్కడ శిలారూపంలో అమ్మవారి పాదముద్రలున్నాయి.

గాంధీ మెమోరియల్...

గాంధీజీ చితాభస్మాన్ని సముద్రంలో నిమజ్జనం చేసేముందు ఆ పాత్రను ఉంచిన స్థలంలో గాంధీస్మారక చిహ్నంగా మందిరాన్ని నిర్మింపజేశారు. ఒడిశా రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ఈ భవనాన్ని నిర్మించారు.



విద్యుద్దీపకాంతుల్లో తిరువళ్లువర్ విగ్రహం, అద్దాల వారధి

స్థల పురాణం...

కన్నియాకుమారి ఆలయంలో భక్తుల నిత్యనీరాజనాలు అందుకుంటూ అత్యంత శక్తివంతమైన అమ్మవారిగా ఖ్యాతికెక్కిన కన్యాకుమారి గురించిన ఒక కథ చాలా ప్రాచుర్యంలో ఉంది. అది... ఒకప్పుడు బాణాసురుడనే రాక్షసుడు దేవతలను బాధించేవాడు. వాటిని భరించలేక దేవతలంతా విష్ణుమూర్తిని శరణువేడారు. ఆ పరాశక్తి మాత్రమే బాణాసురుడిని మట్టుబెట్టగలదని, ఆమెను శరణు వేడుకొమ్మని మహావిష్ణువు దేవతలకు సూచించాడు. ఆమెను ప్రసన్నం చేసుకొనేందుకు దేవతలు యజ్ఞయాగాదులు చేశారు. అమ్మవారు ప్రత్యక్షమై కొద్దిరోజుల్లో బాణాసురుడిని సంహరిస్తానని దేవతలకు అభయమిచ్చింది. ఆ తర్వాత అమ్మవారు కన్నియాకుమారి ప్రాంతానికి చేరి, కన్యరూపంలో తపస్సు చేయటం ప్రారంభించింది. ఆ దేవి సౌందర్యానికి ముగ్ధుడైన 'శుచీంద్రం' ఆలయ ఈశ్వరుడు ఆమెను వివాహమాడ సంకల్పించాడు. పార్వతీ అంశ అయిన కన్నియాకుమారి కూడా ఈశ్వరుడితో కల్యాణానికి సన్నద్ధురాలైంది. ఒక శుభదినాన వారిద్దరి కల్యాణానికి ముహూర్తం నిశ్చయింపబడింది. బ్రహ్మ ముహూర్తంలో జరిగే వివాహానికి శుచీంద్రం నుండి పరమేశ్వరుడు బయలుదేరాడు. కానీ అమ్మవారికి వివాహమైతే బాణాసురుడికి మృత్యువు ఉండదని గ్రహించిన నారదుడు ఒక అవాంతరాన్ని సృష్టించాడు. ఎందుకంటే బాణాసురుడిని సంహరించాలంటే కేవలం కన్యవల్లే అవుతుంది. అందుకే నారదుడు ఈశ్వరుడు, కన్నియాకుమారీల వివాహానికి ఆటంకం కలిగించే ప్రయత్నంలో తానే కోడి రూపంలో కూశాడు. బ్రహ్మి ముహూర్తం దాటిపోయిందని శివుడు వెనుకకు మరలి, శుచీంద్రంలోనే స్థానేశ్వరుడిగా ఉండిపోయాడు. విషయం తెలుసుకున్న కన్నియాకుమారి దుఃఖించి తన జీవితాంతం కన్యగా ఉండేందుకు నిశ్చయించుకున్నది. దీంతో వివాహానికి సేకరించిన వస్తువులన్నీ రంగుల ఇసుకరేణువులుగా మారిపోయాయి. సముద్రతీరంలో ఉండే ఇసుక ప్రదేశాలు ఇలా ఏర్పడ్డాయని పెద్దలు అంటారు. కన్నియాకుమారి గురించి విన్న బాణాసురుడు అక్కడికి చేరుకుని తనను వివాహమాడమని ఆమెను ఎన్నోవిధాలుగా ప్రార్థించాడు. అయినా ఆమె అతడి విన్నపాన్ని తిరస్కరిస్తుంది. దీంతో బాణాసురుడు ఆమెను సంహరించేందుకు కత్తి దూశాడు. తపోబలంతో కన్నియాకుమారి బాణాసురుడిని సంహరించింది. ఆపై పార్వతీరూపమైన అమ్మవారు కన్నియాకుమారిలోనే వెలసి పూజలందుకుంటున్నారు.

ఎలా చేరుకోవాలి?...

కన్నియాకుమారి రైల్వేస్టేషన్ సమీపంలోని నాగర్‌కోయిల్ రైల్వేస్టేషన్ భారతదేశంలోని దాదాపు అన్ని నగరాల నుంచి రైళ్లున్నాయి. దీని సమీపంలో తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉంది. ఇది కన్నియాకుమారి పట్టణం నుండి 96 కిలోమీటర్లు, నాగర్‌కోయిల్ నుండి 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. కన్నియాకుమారి చెన్నై నుండి 744 కిలోమీటర్ల దూరంలో ఉంది.




వివేకానంద స్మారక మండపం





టీటీడీ శ్రీవేంకటేశ్వరాలయం



భగవతి అమ్మవారి ఆలయం



భగవతి అమ్మవారి ఆలయ రాజగోపురం

కామరాజర్ మెమోరియల్...

రాజనీతిజ్ఞుడయిన కామరాజ నాడర్ గౌరవ చిహ్నంగా ఇక్కడ మందిరాన్ని కట్టారు. ఆయన ఛాయాచిత్రాలను ఈ మందిరంలో సందర్శించవచ్చు.

తిరువళ్లువర్ విగ్రహం....

వివేకానంద రాక్‌కు సమీపంలోని తిరువళ్లువర్ విగ్రహం 133 అడుగుల ఎత్తులో ఉంటుంది. రెడువేల సంవత్సరాల పూర్వం విశిష్ఠ తమిళ కవిగా తిరువళ్లవర్ ప్రసిద్ధికెక్కిరు.

గ్లాస్ బ్రిడ్జి...

భారతదేశంలో మొట్టమొదటిగా గాజు వంతెన కన్నియాకుమారిలో సముద్రం మధ్య నిర్మించారు. పాదచారులు వివేకానంద రాక్ మెమోరియల్ నుండి తిరువళ్లువర్ విగ్రహం వద్దకు నడిచివెళ్ళేందుకు ఈ వంతెన నిర్మించారు.

మరుందువాళ్ మలై...

కన్నియాకుమారికి 4 కిలోమీటర్ల దూరంలో వుండే ఈ మరుందువాళ్ మలై ప్రాంతంలో అగస్త్య మహర్షి నివసించాడనే కథనం ఉంది. హనుమంతుడు సంజీవని పర్వతాన్ని తీసుకొని వెళ్ళే సమయంలో కన్నియాకుమారి ప్రాంతంలో పర్వతంలోని కొంత భాగం విరిగి ఇక్కడ పడిందని, అదే మరుందువాళ్ మలైగా ప్రసిద్ధికెక్కిందని స్థానికులు చెబుతారు. కన్నియాకుమారి ప్రాంతంలో అనేక రకాల అరుదైన పుష్పజాతులు, వృక్షాలున్నాయి. ఇక్కడికి రకరకాల జాతులకు చెందిన బాతులు వలసవస్తుంటాయి. అదేవిధంగా ఎన్నోరకాల విదేశీ పక్షులు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంటాయి. ఆధ్యాత్మికులకు పుణ్యధామంగా, భక్తులకు దివ్యక్షేత్రంగా, పర్యాటకులకు నిసర్గ నిరుపమాన సుందర ప్రదేశంగా కన్నియాకుమారి పుణ్యక్షేత్రం అలరారుతున్నది.



అద్దాల వంతెన

ఆలయ విశేషాలు....

ఆలయ సమీపంలోని స్నానఘట్టంలో భక్తులు స్నానమాచరించేందుకు అనువుగా ఉంటుంది. ఆలయ ప్రాంగణంలో ఆది శంకరాచార్యుల మందిరం ఉంది. ప్రధానాలయం ప్రాంగణంలోని చిత్రశాలలో అమ్మవారి వివిధ అవతారాల చిత్రపటాలు కనిపిస్తాయి. ఆలయానికి కుడివైపున బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయాన్ని దర్శించవచ్చు. ఈ ఆలయం లోపల బావిలోని జలాలను విగ్రహమూర్తుల అభిషేకాలకు ఉపయోగిస్తారు. గర్భగుడిలో అమ్మవారి విగ్రహం తూర్పువైపు నిలబడి ఉంటుంది. ఆలయ తీర్పు దిక్కునవున్న ప్రవేశద్వారం ఎప్పుడూ మూసే వుంటుంది. అందుకే భక్తులు ఉత్తరద్వారం గుండా ప్రవేశిస్తారు. కొన్ని ప్రత్యేకమైన రోజుల్లో మాత్రమే తూర్పుద్వారాన్ని తెరుస్తారు. గర్భగుడిలోని అమ్మవారి వజ్రపు ముక్కుపుడక దేదీప్యమానంగా ప్రకాశిస్తూవుంటుంది. కన్నియాకుమారి ఆలయం పూర్వం సముద్రమున్న స్థానంలో ఉండేదని, సముద్ర పరిధి పెరగడంతో దానిని పాండ్యరాజులు 8వ శతాబ్దంలో ప్రస్తుత ప్రదేశంలో నిర్మించినట్లు చెబుతారు. వారణాసి పరమశివుడికి నివాస స్థలమైనట్లుగానే, పార్వతీదేవికి కన్నియాకుమారి నివాస స్థలమని స్థానికుల విశ్వాసం. ఇవే కాకుండా ఈ ఆలయం వెలుపల ఎన్నో దర్శనీయ స్థలాలున్నాయి. ఆలయానికి సమీపంలో 'సునామీ స్థూపం' ఉంది.



త్రివేణి సంగమం

రామ్‌రాజ్ కాటన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలకు విశేష స్పందన



వివిధ ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు

చెన్నై, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వస్త్రప్రపంచంలో ప్రసిద్ధి చెందిన రామ్‌రాజ్ కాటన్ సంస్థ ప్రపంచ రక్తదానదినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుప్పూర్, ఈరోడ్, మదురైలోని తమ యూనిట్లలో శనివారం రక్తదాన శిబిరాలు నిర్వహించింది. ఈ శిబిరాలకు సంస్థ ఉద్యోగులు భారీగా హాజరవ్వడం విశేషం. అదే విధంగా రామ్‌రాజ్ కాటన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల సహా వెయ్యిమందికి పైగా ఉద్యోగులు ఈ శిబిరాల్లో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. సమాజం కోసం చేపట్టిన అరుదైన సేవలో పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తమ కార్యంతో సమాజంలో ఎంతోమందికి కొత్త జీవితం ప్రసాదించినట్లవుతుందని పేర్కొన్నారు.

ప్రభుత్వంతో హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ఒప్పందం



ఒప్పంద కార్యక్రమంలో ఇరువురు ప్రతినిధులు

అడయార్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఒకేషనల్ ఎడ్యుకేషన్ మరింతగా ప్రోత్సహించేలా హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ప్రభుత్వంతో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా హెచ్‌సీఎల్ సంస్థ ప్రభుత్వంతో స్టార్టప్ టీఎన్, డైరెక్టరేట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ (ఉపాధి, శిక్షణా విభాగం) అనే అంశాలపై ఈ ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కింద రాష్ట్ర ప్రభుత్వం స్టార్టప్ ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్న విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, హెచ్‌సీఎల్‌ల మధ్య కుదిరిన ఒప్పందంలో హెచ్‌సీఎల్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ నిధి పుంఢీర్, టీఎన్ఎస్ఐఎం సీఈవో శివరాజా రఘునాథన్ సంతకాలు చేశారు.

ట్రిప్లికేన్‌లో 'టాయిలెట్' వాక్



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

పెరంబూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): 'ఇంటర్నేషనల్ టాయిలెట్ ఫెస్టివల్ దినోత్సవంలో భాగంగా ట్రిప్లికేన్‌లో టాయిలెట్ వాక్ నిర్వహించారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్, వాష్‌లాబ్, ఛీర్, రీసైకిల్ బిన్ సంస్థల సహకారంతో ఈ నెల 4వ తేది ఇంటర్నేషనల్ టాయిలెట్ ఫెస్టివల్ నిర్వహించారు. ఇందులో 3.0లో ఒక అంశంగా, టాయిలెట్ శుభ్రంగా ఉంచుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించేలా టాయిలెట్ వాక్ అవగాహన కార్యక్రమం శనివారం ట్రిప్లికేన్‌లో జరిగింది. కార్యక్రమంలో వాష్‌లాబ్, ఛీర్, రీసైకిల్ బిన్ సంస్థలకు చెందిన నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.